


కూటమి కాలయాపన

● సూపర్ సిక్స్ అమలుపై స్పష్టత కరువు ● లబ్ధిదారులుల్లో ఆందోళన మొదలు

'సూపర్ సిక్స్' అంటూ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తాం.. రైతులకు ఏటా రూ.20 వేలు సాగుపెట్టుబడి సాయం అందిస్తాం.. ప్రతీ మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలా రూ.1500 ఆర్థిక సాయం అందిస్తాం.. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ గడపగడపకు వెళ్లి ప్రచారం చేశారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ఆశపెట్టారు. తీరా అధికారంలోకి వచ్చి వంద రోజులు పూరవుతున్నా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. ఈ స్థితిలో సూపర్ సిక్స్ హామీలు అమలు కష్టమని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో చెప్పడంతో అర్హులలో ఆందోళన నెలకొంది. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి పార్వతీపురం/సాలూరు



ఎన్నికల ప్రచారంలో భాగంగా మే నెల 9న పార్వతీపురం జిల్లాలో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, జీవో 3ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవుతున్నా హామీల ఊసేలేదు.

రైతుకు భరోసా ఏది బాబూ?



ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే గత ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించేంది. కూటమి ప్రభుత్వం వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయం ఇంతవరకు అందించలేదు. వ్యవసాయానికి ప్రకృతి సహకరిస్తున్నా.. ప్రభుత్వం మాత్రం సహకరించడం లేదు. – తాడంగి సీతారాం, రైతు, తాడంగివలస, సాలూరు మండలం

రూ.45 వేలు వస్తాయని ఆశపడ్డా..



నాకు ముగ్గరు పిల్లు ఉన్నారు. పనిచేసు కుంటూ పిల్లలను చదివించుకుంటున్నా ను. తల్లికి వందనం పథకం కింద చదువుకునే పిల్లలకు ప్రభుత్వం ఏటా రూ.15 వేలు ఇస్తానంది. నా ఇద్దరు పిల్లలకు రూ.45 వేలు వస్తాయని ఆశపడ్డాను. కానీ ఇంత వరకు ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో చెప్పాలి.

– శ్రావణి, తల్లి, పార్వతీపురం

అన్నదాతకు అండగా నిలవాలి



గత ప్రభుత్వం ఏటా జూన్ నెలలో రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇంతవరకు రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయక పోవడంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. సాగు సాయం ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలి.

– ఎన్.రామకృష్ణ, రైతు, సీతానగరం

అమలు చేసే ఉద్దేశం ఉందా.. లేదా?



తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. మీ పిల్ల బాధ్యత మేలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. ఇప్పుడు ఉలుకుపలుకు లేకుండా ఉన్నారు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూ.30 వేలు వస్తుందని ఆశపడ్డాను. పిల్లలు వివరాలు పాఠశాలలో ఉన్నప్పటికీ సర్వేలు పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. పథకం అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా లేదా?

– ముగడ సత్యవతి, గృహిణి, తోణాం గ్రామం, సాలూరు మండలం

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాను



నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నాను. చదువు పూర్తిచేసి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాను. కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతీ నెల నిరుద్యోగ భృతి అందుతుంది, ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని అనుకున్నాను. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా ఇంతవరకు నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన లేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలి.

– సంగిరెండి అశోక్, నిరుద్యోగి, మరిపల్లి గ్రామం, సాలూరు మండలం

బాబు.. ఏదీ జవాబు?

ఆశగా ఎదురు చూస్తున్నాం..



మాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరినీ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాం. గత ప్రభుత్వంలో అందించిన అమ్మఒడి పథకంతో మా పిల్లల చదువులు సాఫీగా సాగిపోయాయి. కూటమి ప్రభుత్వం వస్తే ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. వారి మాటలు నమ్మి కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చాం. మా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం కింద రూ.30 వేలు ఈ ప్రభుత్వం అందిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– పిట్టా పుష్పలత, గొల్లవీధి, సాలూరు మున్సిపాలిటీ

ఈ ఏడాది నుంచే ఇస్తారని ఆశిస్తున్నాం



మహిళలకు ప్రతినెలా రూ.1500లు ఇస్తామని ఎన్నికల్లో టీడీపీ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైంది. ఇంత వరకు హామీ అమలు చేయలేదు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ మహిళకు నెలకు రూ.1500 అందించాలి. ఈ ఏడాది నుంచే ఇస్తారని ఆశిస్తున్నాం.

– మజ్జి గౌరి, 11వ వార్డు, సాలూరు మున్సిపాలిటీ

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే..



ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చారు. ఇందులో యువతకు 20 లక్షల ఉద్యోగా లు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చేంత వరకు ప్రతి నెలా రూ.3 వేలు భృతి చెల్లిస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా ఇప్పటివరకు అతీగతీలేదు.

– అనిల్‌కుమార్, నిరుద్యోగి, పార్వతీపురం

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి



ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ప్రయాణ ఖర్చులు తగ్గుతాయని ఆశపడ్డాం. ఈ పథకాన్ని ఎప్పుడు నుంచి అమలు చేస్తారో అని ఎదురు చూస్తున్నాం. పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారు. మన రాష్ట్రంలో ఇంకా అమలు చేయకపోవడంతో చంద్రబాబు ఏది చెప్పినా అమలు చేయరని ప్రజలు అనుకుంటున్నారు. బాబును ప్రజలు నమ్మాలంటే హామీలు అమలు చేయాలి.

– కొల్లి సరస్వతి, సాలూరు

ఉచిత గ్యాస్ ఉత్తిమాటేనా?



మా గ్రామంలో అందరూ ఉచిత గ్యాస్ ఉత్తి మాట లేనని అంటున్నారు. ఉచిత గ్యాస్ పథకం అమలు కోసం గృహిణులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉచిత గ్యాస్ అసలు ఇచ్చే ఆలోచన ఉందా లేదా? ఇస్తే ఎప్పుడు ఇస్తారో చెప్పండి.

– ముంగి పాపమ్మ, గృహిణి, బూతాడవలస, సాలూరు మండలం

మహిళకు నెలకు రూ.1500 సాయం



నియోజకవర్గం	అర్హులు	పొందాల్సిన లబ్ధి (సుమారు)
పార్వతీపురం	21,392	రూ.3.20 కోట్లు
సాలూరు	81520	రూ.12.22 కోట్లు

అన్నదాతా సుఖీభవా



నియోజకవర్గం	అర్హులు	పొందాల్సిన లబ్ధి (సుమారు)
పార్వతీపురం	32 వేలు	రూ. 64.00 కోట్లు
సాలూరు	39 వేలు	రూ.78 కోట్లు



తల్లికి వందనం



నియోజకవర్గం	అర్హులు	పొందాల్సిన లబ్ధి (సుమారు)
పార్వతీపురం	19,396	రూ.29.09 కోట్లు
సాలూరు	30 వేలు	రూ.45 కోట్లు

నిరుద్యోగ భృతి




నియోజకవర్గం	అర్హులు	పొందాల్సిన లబ్ధి (నెలకు, సుమారు)
పార్వతీపురం	42561	రూ.12.76కోట్లు
సాలూరు	60 వేలు	రూ.18 కోట్లు



గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)
పార్వతీపురం	92,665
సాలూరు	1.7 లక్షలు



మహిళలకు ఉచిత బస్సు

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)
పార్వతీపురం	1.63 లక్షలు
సాలూరు	1.11 లక్షలు

జగన్ చెప్పారు.. చేశారు..



జగనన్న ప్రభుత్వంలో రూ.18,500 ఠంఛనుగా అందుకున్నాం



18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు రూ.15 వందలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూటమి ప్రభుత్వం చెప్పాలి. జగనన్న ప్రభుత్వంలో ఏటా రూ.18500లు చెప్పిన సమయానికి ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలంతా ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు అమలు చేస్తారో చెపితే బాగుంటుంది.

– సంగిరెడ్డి ఈశ్వరమ్మ, గృహిణి, మరిపల్లి గ్రామం, సాలూరు మండలం

గతంలో సకాలంలో ఇచ్చేవారు



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాప ములక్కాయవలన మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. బాబు కూడా అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంతవరకు అమ్మకు వందనం డబ్బులు ఇవ్వలేదు. గత ప్రభుత్వం జూన్, జూలై నెలల్లోనే అమ్మఒడి పథకం డబ్బులు మా ఖాతాలో జమ చేసేది. ఈ ప్రభుత్వం తల్లికి వందనం డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తుందా అని ఎదురుచూస్తున్నాం.

– గంట్యాడ జ్యోతి, మక్కువ గ్రామం, మక్కువ మండలం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించారు. అందులో పేర్కొన్న తేదీకి ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసేది. సాలూరు నియోజకవర్గంలో 29,779 మందికి అమ్మ ఒడి పథకం కింద ఐదేళ్లలో రూ.1,24,99,60,292లు అందించారు. 38,836 మంది రైతులకు రైతుభరోసా పథకం ద్వారా రూ.1,74,58,13,700లు అందించారు.



క్లుప్తంగా

పెదగైశీలలో వైద్యశిబిరం



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పెదగైశీల గ్రామంలో బుధవారం శంబర పీహెచ్‌సీ సిబ్బంది, 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

పార్వతీపురంటౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎస్‌వైబీ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. వైకేఎం కాలనీలో జిల్లా సమాఖ్య భవనంలో బుధవారం శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 వరకు స్టార్ట్ యువర్ బిజినెస్ (ఎస్‌వైబీ)పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8వ తరగతి పాసై, 18–40 సంవత్సరాల లోపు వయసున్న స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 9177297528 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఎసీడీసీ అధికారులు పాల్గొన్నారు.

దాడులు చేసే చరిత్ర టీడీపీ నాయకులదే..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సాలూరు రూరల్: మండంలోని మరిపల్లి గ్రామంలో గతంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయడంతో పాటు ఎస్‌ఐని సైతం నిర్బంధించిన ఘనత టీడీపీ నాయకులదేనని మరిపల్లి ఎంపీటీసీ సభ్యుడు జన్ని సీతారాం వర్గీయులు ఆరోపించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మరిపల్లి జన్ని కుటుంబం రాజకీయాల్లోకి వచ్చాక తమపై తప్పుడు కేసులు పెరిగాయని టీడీపీ నాయకులు కసినబోయిన వెంకటరమణ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. తమ కుటుంబం ఏనాడూ గొడవలకు పోలేదని, అందుకే గత 10 ఏళ్లుగా ఎంపీటీసీ, సర్పంచ్‌లుగా తమను గ్రామస్తులు గెలిపిస్తున్నారన్నారు. తమపై ప్రజలు చూపిస్తున్న ఆధరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కోటి రూపాయల విలువైన భూమిని రూ.51 లక్షలకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని, తనకా రిజిస్ట్రేషన్ పేరుతో క్రయం రిజిస్ట్రేషన్ చేయించారని, భూహక్కు కోసం న్యాయపోరాటం చేస్తామే తప్ప తప్పుడు కేసులు పెట్టాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా కులం పేరుతో ధూషించి, దాడి చేసిన ఘటనలో పోలీసులను ఆశ్రయించేమే తప్ప ఇందులో భూ వివాదం లేదని, దాన్ని కల్పించి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంపీటీసీ జన్ని సీతారాం దాడికేసుపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాగాన పోలినాయుడు, సత్యం, ఆత్రు రాంబాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో అనంతకుమారి

మక్కువ: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మార్కొండపుట్టి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో అనంత కుమారి గర్భిణులకు సీమంతాలు చేసి పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆకుకూరలు, పాలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఈ–క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి

బలిజిపేట: రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడంతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు సూచించారు. వెంగాపురంలో ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకోవడం వల్ల రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు పొందవచ్చన్నారు. మండలంలో వరి 16,004.57 ఎకరాలు, మొక్కజొన్న 688.03 ఎకరాలు, జీడీ 130 ఎకరాలు, ఆయిల్‌పామ్ 583.80 ఎకరాలు, మామిడి 407.12 ఎకరాలు, అరటి 78.81 ఎకరాల విస్తీర్ణంలో ఈ–క్రాప్‌లో నమోదుచేయడం జరిగిందన్నారు. 8,122 మంది రైతులు 18,249 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారన్నారు. ఇంకా రైతులు ఎవరైనా పంట నమోదులు చేసుకోకపోతే ఈ నెల 23లోగా దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని జీడిపేట వద్ద ఉన్న 11 కేవీ ఫీడర్ పరిధిలో ఈ నెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఇ.ఇ కె.గోపాలరావునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, లైన్లను ఆనుకుని ఉన్న చెట్టుకొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున రాయగడ రోడ్డు, ఇందిర కాలనీ, రామాపురం కాలనీ, సిరియాల వీధి, వివేకానంద కాలనీ, ఓల్డ్ బస్టాండ్ రోడ్డు, మున్సిపల్ ఆఫీసు, బంధం వారి వీధి, గంట వీధి, గంట బడి, దుర్గాంబ వీధి, గోపాల్‌దాస్ పేట, దేవంగుల వీధి, గసివీధి, నెయ్యలవీధి, ముత్తవారి వీధి, తదితర ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫ్యాన్లు, ట్యూబ్ లైట్స్ వితరణ

పార్వతీపురంటౌన్: జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపు మేరకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (పార్వతీపురం బ్రాంచ్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహానికి రూ.17,800లు ఖర్చుతో 10 ఫ్యాన్లు, 20 ట్యూబ్ లైట్లు అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ మాట్లాడుతూ.. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఫ్యాన్లు, లైట్లు అందజేసిన మహారాష్ట్ర బ్యాంకు, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవీఎల్ఎస్ మూర్తి, అసోసియేట్ లీడ్ బ్యాంక్ అధికారి కె.మౌనిక, మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్ ఎ.గణేష్, అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ వెంకటరావు, క్యాషియర్ అనిల్‌నాయక్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పి.రాణి, వసతిగృహ సంక్షేమ అధికారి కురుమమ్మ పాల్గున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



ఇందిరమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని తీన్‌సామంతవలస, అన్నంరాజువలస సెగ్మెంటు ఎంపీటీసీ సభ్యురాలు సీదరపు ఇందిరమ్మ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఇందిరమ్మ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మామిడిపల్లిలో ఇటీవల మృతి చెందిన బుగత చిన్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీను, రామకృష్ణ, సువ్వాడ భరత్‌శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు ఉపాధ్యాయులకు ఎంతో అవసరం

బలిజిపేట: స్కూల్ కాంప్లెక్స్‌లు ఉపాధ్యాయులకు ఎంతో అవసరమని ఎంఈఓ–1 సామల సింహాచలం అన్నారు. పెదపెంకి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చకు వచ్చిన అంశాలను పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపులో అన్వయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు వృత్తి పరంగా ఉన్న అనుమానాలపై చర్చించుకోవడం ద్వారా అవి నివృతి అవుతాయన్నారు. ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంప్లెక్స్ చైర్మన్ భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీపట్టా భూముల పునఃపరిశీలన

సీతానగరం: గతంలో క్రమబద్ధీకరించిన డీపట్టా భూములను అధికారులు పునఃపరిశీలన చేయాలని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ ఆదేశించారు. మండలంలోని వెన్నెల బుచ్చింపేట, ఎ.వెంకటాపురం, అంటిపేట గ్రామాల్లో గతంలో క్రమబద్ధీకరణ చేసిన డీపట్టా భూములను తహసీల్దార్ జె.రాములమ్మతో కలిసి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూములను క్షుణ్ణంగా వెరిఫై చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వెన్నెలబుచ్చింపేటలో 34, ఎ.వెంకటాపురంలో 1, అంటిపేటలో 44 మంది రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు తహసీల్దార్ చెప్పారు. ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన పెంచుకోవాలి

సీతానగరం: వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని బుడ్డిపేట, లక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. వరిలో రసంపీల్చు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలాల్లో పసుపు రంగు జిగురు కార్డులను ఏర్పాటు చేయడం వల్ల పురుగులు వాటికి అతుక్కొని నిశిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పి.లక్ష్మణ్, బి.సుదీర్‌కుమార్, వినయ్‌తేజా, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది గంగరాజు, నవీన్‌తేజ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.